

హుస్సేన్‌సాగర్ గంగమ్మ దేవాలయానికి బోనంతో వచ్చిన గంగపుత్రులు

వర్షాలు బాగా పడాలని గంగమ్మకు ప్రత్యేక పూజలు

ఖైరతాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంతో పాటు గ్రామాల్లో వర్షాలు బాగా కురిసి నీటి కొరత లేకుండా చేయాలని కోరుతూ తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసింది. వర్షారంభ సమయాల్లో ప్రతీయేటా నిర్వహించే సాంప్రదాయ పూజల్లో భాగంగా ఖైరతాబాద్ తుమ్మలబస్తీలోని గంగపుత్ర సంఘం కార్యాలయం నుంచి హుస్సేన్‌సాగర్ ఒడ్డున ఉన్న గంగమ్మ దేవాలయం వరకు బోనం, చీర, సారెతో ఊరేగింపు చేసి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగ తెప్పోత్సవ కమిటీ చైర్మన్ మల్కు మహేందర్‌బాబు మాట్లాడుతూ.. గంగమ్మ ఆశీస్సులుంటేనే వర్షాలు బాగా పడతాయని, నగరంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా వర్షాలు పడాలని అమ్మవారికి ప్రతియేటా పూజలు నిర్వహిస్తామన్నారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, సభ్యులు మంగళపల్లి రాజు, మురళి, కుమార్, ఎ. రవి, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వరద నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

రోడ్లపై వరద నీరు నిలవకుండా చర్యలు

- ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా రోడ్లపై వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నామని పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. ఆదివారం పలు ప్రాంతాల్లో వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్టు చెప్పారు. వర్షం పడినప్పుడు వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ప్రధాన జంక్షన్‌లలో అదనపు సిబ్బందిని నియమిస్తున్నట్టు తెలిపారు.



ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న నవీన్ యాదవ్

క్రీడలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

యూసుఫ్‌గూడ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించాలని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ కన్వీనర్ వి.నవీన్‌యాదవ్ అన్నారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఒలింపిక్ రన్ కమిటీ అధ్వర్యంలో 38వ ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. యువతకు కేవీబీఆర్ స్టేడియంలో క్రీడల్లో శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో కేవీబీఆర్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, ఇంటర్నేషనల్ హ్యాండ్‌బాల్ మాజీ క్రీడాకారుడు కె.నర్సింహ, నేషనల్ ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారుడు కైసర్, కన్వీనర్ జగన్‌మోహన్ గౌడ్, కేవీబీఆర్ స్టేడియం కోచ్‌లు ఇమ్రోజ్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గెలిచిన ప్యానల్‌కి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి యూసుఫ్ అలీ

ఎన్ఆర్ఆర్ పురం హౌసింగ్ సొసైటీ అభివృద్ధికి కృషి

బోరబండ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): నూకల రాంచంద్రారెడ్డి పురం (ఎన్ఆర్ఆర్ పురం) కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎన్నికల్లో గెలిచిన సభ్యులు తెలిపారు. హౌసింగ్ సొసైటీకి ఆదివారం జరిగిన ఎన్నికల్లో చాట్ల ఎలియ, సి.అమృత, అక్తర్ సుల్తానా, షేక్ యూసుఫ్‌వుద్దీన్, ఎండీ ఇమామ్ గోరి, సి.సత్యనారాయణ, సి.ఎస్.రామ్మోహన్‌రావు, అమ్జద్ అలీ, ఎ.సత్తాజీ, సి.ఎస్.సాయినాథ్‌రావు, ఎండీ అబ్దుల్ రహ్మాన్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి యూసుఫ్ అలీ ప్రకటించారు.

యాదగిరినగర్ అసోసియేషన్ కార్యవర్గం

యూసుఫ్‌గూడ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): యాదగిరినగర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక చైర్మన్‌గా వి. చిన్న శ్రీశైలం యాదవ్, సలహాదారుడిగా వి. నవీన్‌యాదవ్, అధ్యక్షుడిగా గోపాల్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా జీవీవీ రామారావు, ప్రధాన కార్యదర్శులుగా కె.మహేంద్ర, వి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా యూహెచ్‌కే వర్మ, టి.చిరంజీవి, లీగల్ అడ్వయిజర్‌గా వి.సత్యనారాయణ, నర్సింగ్ ముదిరాజ్, కోశాధికారులుగా గిరిధర్‌రెడ్డి, మధు, శ్రీనివాస్‌తో పాటు పలువురు కరస్పాండెంట్స్, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు.



మంతెన శ్రీనివాసరాజును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థి సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ తదితరులు

ఘనంగా పూర్వ విద్యార్థుల 30 ఏళ్ల వేడుక

పంజాగుట్ట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఉత్సాహంగా గడిపారు. వెంగళరావునగర్ నలంద విద్యా సంస్థలోని గుడ్ సమరిటన్ హైస్కూల్‌లో 1994లో చదువుకున్న పూర్వ విద్యార్థులు నగర శివారులోని గోల్కొండ రిసార్ట్‌లో ఆదివారం 30 సంవత్సరాల వేడుక ఘనంగా జరుపుకున్నారు. నలంద విద్యా సంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు.

టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ కార్యదర్శిగా కర్క నాగరాజు

బాలానగర్, జూన్ 23(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా కర్క నాగరాజు ఆదివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర చైర్మన్ ఆర్.ప్రకాష్‌గౌడ్ నాగరాజుకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సప్పిడి భాస్కర్, హెచ్ఏఎల్ ఐఎన్‌టీయూసీ కార్మిక యూనియన్ అధ్యక్షుడు సబ్గతుల్లా, వై. భాస్కర్‌రావు, సదామహేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర సైనికులు

వారాంతంలో బస్తీల్లో సేవలు

- ప్రభుత్వ పాఠశాలల్లో పాఠాలు
- పేదల కోసం ఆరోగ్య శిబిరాలు
- వసుధైక కుటుంబం లక్ష్యంగా స్టూడెంట్ సోషల్ సర్వీస్



స్టూడెంట్ సోషల్ సర్వీస్ ప్రతినిధులు

బంజారాహిల్స్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): చదువు, ఎంజాయ్.. కాలేజీ డేస్‌లో కుర్రాళ్లు అవలంబించే తీరు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. మా చదువుకు ఓ అర్థం ఉండాలని యువత భావిస్తోంది. మానవ సేవే మాధవ సేవ అన్న వివేకానందస్వామి సూక్తిని ఆశయంగా తీసుకొని ముందడుగు వేస్తున్నారు. మేం బాగుండాలి.. చుట్టూ ఉన్న వారు ఆనందంగా ఉండాలనే భావనతో కుర్ర దుర్గారావు స్టూడెంట్ సోషల్ సర్వీస్ పేరిట సంస్థను స్థాపించాడు. లీడ్ వరల్డ్ 2050 పేరిట కొన్ని లక్ష్యాలను నిర్ధేశించుకున్నారు. బస్తీల్లో



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చదువు చెబుతున్న ప్రతినిధులు



ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో మందుల పంపిణీ

జీవన శైలిని మార్చే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఒక్కడితో మొదలై ఇప్పుడు సంస్థలో అనేకమంది ప్రతినిధులు వచ్చి చేరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెప్పడం, పేదల ఆరోగ్యం బాగు కోసం ఉచిత వైద్య శిబిరాలు, బస్తీల్లో సమస్యలను పరిష్కరించడం ఇలా తమ దృష్టికి వచ్చి వాటిని భుజం మీద వేసుకొని మరీ సేవలందిస్తున్నారు సంస్థ ప్రతినిధులు.

అందరూ చదువుకున్న వారే..

ప్రస్తుత సమాజంలో ఎంతమంది ప్రతినిధులు వచ్చినా.. ఎన్ని విరాళాలు సేకరించినా బస్తీల్లో జీవన పరిస్థితులను మార్చాలంటే ఇంకా శ్రమించాల్సిందేనని గుర్తించాడు. ఈ క్రమంలో సంస్థలో ప్రతినిధుల సంఖ్య పెంచే దిశగా యువతలో స్ఫూర్తి కలిగించారు. బీటెక్ పూర్తయింది ఇక ఉద్యోగమే.. ఆ వెంటనే పెళ్లి ఇదే జీవితం కాదన్న సత్యాన్ని సంస్థ ప్రతినిధులు తెలుసుకున్నారు. ఉద్యోగం చేసుకుంటూ సేవ బాట పట్టారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ పూర్తి చేసిన అనేకమంది దుర్గారావు భావాలకు అండగా ఉంటూ తమ వంతు సహాయం చేస్తున్నారు.

రోజుకో రూపాయి..

సేవ అనగానే డబ్బు అవసరమవుతుంది. రంగారావు మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడు. మనసుంటే మార్గం ఉంటుందని భావించిన ఆయన రోజుకో రూపాయికి ప్రచారం కల్పించారు. ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలకు తిరిగి రోజుకో రూపాయి చొప్పున వారానికి ఐదు రూపాయలు విరాళంగా ఇస్తే బస్తీ పేదల్లో చిరునవ్వులు చూడవచ్చని చెప్పారు. దీనికి విద్యార్థులంతా అంగీకరించారు. తరగతి సంస్థ తరఫున ఓ లీడర్‌ను పెట్టి విరాళాలు సేకరించి వచ్చిన వాటితో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న చిన్నారులకు పుస్తకాలు, బ్యాగులు, పెన్సిల్స్ పెన్నులు, యూనిఫారాలు, షూస్ ఇలా కావాల్సిన వస్తువులు కొనిస్తారు.

అక్షర సేవ..

నిరక్షరాస్యత పోతే జీవన చిత్రాలు మారతాయన్న సూత్రాన్ని నమ్మిన స్టూడెంట్ సోషల్ సర్వీస్ ప్రజల్లో అక్షర చైతన్యం తీసుకువచ్చే బాధ్యత తను తీసుకుంది. 2012లో రాత్రి బళ్లు నిర్వహించింది. దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతుండటంతో తమ విజన్ మార్చుకోలేదు. విద్యావంతులైన యువకులు స్వయంగా ఇళ్లకు వెళ్లి పేదలకు చదువు చెప్పారు. సంతకాలు పెట్టడం, పేర్లు చదవడం వంటి అంశాల పై శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల లోపాన్ని గ్రహించారు. వారే ఉపాధ్యాయులుగా మారి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు కొత్త తరహా పాఠాలు బోధించారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలని, భవిష్యత్తు సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై వివరిస్తున్నారు. ఆంగ్లం, గణితం, కంప్యూటర్ తదితర అంశాల గురించి వీకెండ్‌లో తరగతులు తీసుకుంటారు. బస్తీ వాసుల ఆరోగ్యాన్ని దృష్టిలోపెట్టుకొని కార్పొరేట్ ఆస్పత్రులను సంప్రదించి ప్రతి ఆదివారం వైద్యులతో పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తున్నారు.

బస్తీల్లో సమస్యలపై..

తమ సేవలను మరింత అర్థవంతంగా తీర్చిదిద్దాలని భావించిన లీడ్ వరల్డ్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏదో ఒకటి చేయాలనే ఆలోచనతో బెనోవెలెంజ్ సంస్థను ఏర్పాటు చేసింది. వసుధైక కుటుంబం పేరిట ప్రతి శని, ఆదివారాల్లో బస్తీల్లో తిరుగుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదిక రూపొందించి వాటిని పరిష్కరించే మార్గాలను అన్వేషిస్తారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో సంప్రదించి సమస్యలను కొలిక్కి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులనే బస్తీలకు తీసుకువచ్చి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు చర్యలు చేపడుతున్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్టళ్లపై చర్యలు

ఏసీపీ మోహన్‌కుమార్

బంజారాహిల్స్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్టళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ హెచ్చరించారు. పంజాగుట్ట డివిజన్ పరిధిలోగల ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులతో సోమాజిగూడ జయాగార్డెన్స్‌లో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా హాస్టళ్లలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నెల రోజుల డాటా ఉండేలా హార్డ్‌డిస్క్‌లు, 24 గంటలు సెక్యూరిటీ సిబ్బంది నియమించుకోవడంతో పాటు పార్కింగ్ వసతి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు నష్ట నివారణ కోసం ఫైర్ సెఫ్టీ కిట్‌లను సిద్ధం చేసుకోవాలని, హాస్టల్ ఏర్పాటు చేసుకున్న వారు అవసరమైన అన్ని లైసెన్స్‌లు పొందాలని, విజిటర్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో పంజాగుట్ట, మధురానగర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



హాస్టళ్ల నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ మోహన్‌కుమార్





ఫిలింనగర్, యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహనగర్‌లో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మహనీయుల జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి

బంజారాహిల్స్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భోజిరెడ్డి అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఫిలింనగర్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని ప్రపంచ పటంలో అగ్రభాగాన ఉంచేందుకు స్వాతంత్ర్యం రాకముందు నుంచి అనేకమంది ప్రాణాలు అర్పించారన్నారు. వారు చేసిన త్యాగ ఫలాలు ప్రస్తుత తరం అనుభవిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి, దండుగుల శ్రీనివాస్, కొత్త నీరజ, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

యూసుఫ్‌గూడ: యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహనగర్‌లో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నాయకులు సతీష్, ప్రేమ్‌కుమార్, కాట్రాజ్, రాజశేఖర్, చంద్రశేఖర్, భరత్, ఓంకార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

బాధితుడి ఫిర్యాదుపై అలసత్వం

నాగోల్ ఎస్‌హెచ్‌ఓపై చర్య

- సీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

కొత్తపేట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బాధితుడి ఫిర్యాదుపై అలసత్వం వహించిన నాగోల్ ఎస్‌హెచ్‌ఓ పరశురాంను ఈ నెల 22న సీపీ ఆఫీస్‌కు తాత్కాలికంగా అటాచ్ చేస్తూ సీపీ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 2న ఎల్బీనగర్, ఎన్టీఆర్‌నగర్‌లో సాయినగర్ కాలనీకి చెందిన వి.మల్లేష్, నరేష్, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనిల్, సాయినగర్‌కు చెందిన జ్యోతి, నాగరాజు, నాగోల్‌కు చెందిన పీ.మనోజ్, సాయినగర్ కాలనీకి చెందిన శశాంక్, సాయినగర్ గుడిసెల్లో ఉండే పవన్‌కుమార్‌తోపాటు మరో ఇద్దరు బాలలు, భరత్‌నగర్‌కు చెందిన దాసరి గౌతం అలియాస్ బద్దు (20) మధ్య గొడవ జరిగింది. గాయపడ్డ గౌతం ఈ నెల 21న నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌హెచ్‌ఓ పరశురాం కేసు నమోదు చేయడంలో అలసత్వం వహించడంతో బాధితుడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ తరుణ్ జోషి.. పరశురాంను కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. ఫిర్యాదుపై స్పందించడంలో అలసత్వం వహించిన ఎస్ఐ మధు, ఏఎస్ఐ అంజయ్యపై కూడా సీపీ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎల్బీనగర్ డీఐ సుధాకర్‌ను తాత్కాలికంగా నాగోల్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.

సాయినగర్‌లో ఏం జరిగిందంటే..

ఎల్బీనగర్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో ఈ నెల 2న నిందితులకు, భరత్‌నగర్‌కు చెందిన దాసరి గౌతం అలియాస్ బద్దు (20) మధ్య గొడవ జరిగింది. గతంలో జువెనైల్ అఫెండర్లకు, గౌతంకు గొడవలు జరిగాయి. గౌతంపై ద్వేషం పెంచుకున్న వారు ప్రధాన నిందితుడైన వి.మల్లేష్‌తో కలిసి గొడవపడ్డారు. అప్పటినుంచి గౌతం కదలికలను గమనిస్తూ అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 6వ తేదీ తెల్లవారుజామున నాగోల్, సాయినగర్ కాలనీలోని ఓ స్నేహితుడి ఇంట్లో ఉన్న గౌతంను బయటకు లాక్కొచ్చి కులం పేరుతో దుర్భాషలాడుతూ టెలిఫోన్ స్తంభానికి కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. బాధితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ 15 వేలు తీసుకొని పారిపోయారు. ఈ నెల 21న గౌతం నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌హెచ్‌ఓ స్పందించలేదు. దీంతో పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 22న 8 మంది నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు జువెనైల్ అఫెండర్లను రెస్క్యూ హోంకు తరలించారు. నిందితులపై హత్యాయత్నం, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి



సత్కారం అందుకున్న కవులతో కొలకలూరి ఇనాక్ తదితరులు

రవీంద్రభారతి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను పరిరక్షించుకునేందుకు రెండు రాష్ట్రాల ప్రజలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారు కృషి చేయాలని ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలుగు కవితా వైభవం(తెలుగు అభివృద్ధి సమితి) ఆధ్వర్యంలో తెలుగు భాషాభివృద్ధి - మన కృషి అనే అంశంపై చర్చగోష్ఠి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొలకలూరి ఇనాక్ కవులను, రచయితలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషను పాఠశాల స్థాయి నుంచే బతికించుకోవాలని అన్నారు. ప్రభుత్వ బడులతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు భాష బోధన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మాతృభాషను మరువద్దన్నారు. సాహిత్యాన్ని కాపాడుకోగలిగితే భాషను బతికించుకోగలుగుతామని అన్నారు. తెలుగు భాష వ్యాప్తి కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమైక్యమై తెలుగును సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరీశంకర్, నాళేశ్వరం శంకరం, దైవజ్ఞశర్మ, మేక రవీందర్, బడేసాబ్, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనులపై ఉక్కుపాదం

- కేసుల నమోదు.. వాహనాల సీజ్

హైదరాబాద్ సిటీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనాలు నడపడం, నిబంధనలు పాటించకపోవడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించిన సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఆదివారం రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై 22 కేసులు నమోదు చేసి, 114 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై ఇప్పటివరకు 122 కేసులు నమోదు చేసి, 631 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లో చలాన్లు విధించే దిశగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో..

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 385 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన వాహనాల్లో 292 బైకులు, 11 ఆటోలు, 80 కార్లు ఉన్నాయి. 182 కేసులు కేవలం ఐటీ కారిడార్‌లోనే ఉన్నాయని తెలిపారు.



అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్‌లో వివిధ దేశాల ప్రతినిధులు

ముగిసిన అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్

అల్వాల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుస్సేన్‌సాగర్ లేక్ వద్ద ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్ ఆదివారం ముగిసింది. త్వరలో హుస్సేన్‌సాగర్‌లో అంతర్జాతీయ సెయిలింగ్ వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సెయిలింగ్ పోటీలలో పాటించాల్సిన నియమ నిబంధనలతో పాటు తీసుకోవాల్సిన పద్ధతులపై పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించే వారికి సెమినార్‌లో లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే వివరించారు. 15 ఏళ్ల తరువాత ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్‌ను భారతదేశంలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. సెమినార్‌లో క్రిస్ వాట్స్(జీబీఆర్), రూట్‌సబ్‌నిరన్(థాయిలాండ్), లియోనార్డ్ చిన్(మలేషియా), పోక్‌పాంగ్(థాయిలాండ్) వంటి అంతర్జాతీయ ప్రముఖ జడ్జీలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

గ్రూప్-3, 4 నోటిఫికేషన్‌లలో

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను పెంచాలి

నల్లకుంట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా గ్రూప్-3, 4 నోటిఫికేషన్‌లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి వివేక్ మాట్లాడారు.

తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలి



మంత్రికి వినతిపత్రం అందజేసిన సాహితీ సంస్థల నిర్వాహకులు

రవీంద్రభారతి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సాహితీ సంస్థల అధినేతలు కోరారు. ఆదివారం రవీంద్ర భారతి ప్రాంగణంలోని సాంస్కృతిక శాఖ మంత్రి కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.బడేసాబ్, దర్పణం సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు శ్రీరామకృష్ణ, చంద్రమౌళి, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు చంద్రప్రకాష్ రెడ్డి, తెలుగు కవితా వైభవం అధ్యక్షుడు మేక రవీంద్ర, లక్ష్య సాధన ఫౌండేషన్ చైర్మన్ గంట మనోహర్‌రెడ్డి, సంపంగి నరసింహులు, నరసింహశర్మ పాల్గొన్నారు.



తలసాని శంకర్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

మాజీ మంత్రి తలసానికి కిషన్‌రెడ్డి పరామర్శ

మారేడుపల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరిమర్శించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ ఈనెల 10వ తేదీన మరణించారు. విషయం తెలుసుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని రాధికా కాలనీలో శంకర్‌యాదవ్ నివాసానికి చేరుకున్నారు. ఆయన శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం తలసాని శ్రీనివాసయాదవ్, వారి మాతృమూర్తి లలితాబాయి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

● గుర్రం పవన్ కుమార్ గౌడ్



గుర్రం పవన్ కుమార్ గౌడ్

రాంగోపాల్‌పేట్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, హైదరాబాద్ జంట నగరాలలో జరుగనున్న బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున 20కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఇటీవల హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బోనాల జాతరకు హైదరాబాద్ జిల్లాకు 25 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరడం జరిగిందని, అందుకు స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల జరిగిన బోనాల పండుగ సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్ళి నిధులు కేటాయించేలా చేసినందుకు వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో జాతర ఘనంగా జరిగేందుకు 20 కోట్ల నిధులను మంజూరు చేయడం అభినందనీయం అని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



గడ్డం మల్లేష్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

టీఎస్ ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా గడ్డం మల్లేష్

అడ్డగుట్ట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా గడ్డం మల్లేష్ నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌కు అందజేశారు. సికింద్రాబాద్ వర్కింగ్ ప్రసిడెంట్ చిప్పలపల్లి పరశురాం, ప్రధాన కార్యదర్శి కుర్రల వెంకటేష్‌లకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ఇన్‌చార్జి గడ్డం మల్లేష్ మాట్లాడుతూ తమకు ఈ పదవీ బాధ్యతను అప్పగించినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పసులాది యాదగిరిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్

డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ వేడుకలు

బౌద్ధనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ వేడుకలు ఆదివారం బౌద్ధనగర్‌లో జరిగాయి. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన యోధుడు, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడిగా అనేక సేవా కార్యక్రమాలందించిన ఘనత ముఖర్జీదని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేతి సత్యనారాయణ, భాస్కర్‌గౌడ్, సురేష్, సంపత్, సుధాకర్‌గుప్తా, ఆర్‌వీ.రమణ, పాండు తదితరులు పాల్గొన్నారు.



అన్నానగర్‌లో స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సామల హేమ

అన్నానగర్‌లో కార్పొరేటర్ సామల హేమ పర్యటన

బౌద్ధనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్‌లో స్థానిక కార్పొరేటర్ సామల హేమ ఆదివారం పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్రీఫేస్ కరెంట్, పాత కరెంట్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తానని తెలిపారు. చిలకలగూడ పార్క్ వద్ద డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని స్థానికులు ఫిర్యాదు చేయగా అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా

మరో పాఠశాల భవన నిర్మాణానికి వినతి

గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల

● ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ఫుల్

● అడ్మిషన్ల కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు



బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం వేచిచూస్తున్న తల్లితండ్రులు

బోయిన్‌పల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మన బస్తీ-మనబడి, బడిబాట వంటి విద్యాభివృద్ధి పథకాలతోపాటు గత రెండు సంవత్సరాలుగా పాఠశాల ప్రిన్సిపాల్ బానోతు లాలూ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు అటు విద్యతోపాటు క్రీడలలో రాణిస్తుండడం ద్వారా బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు మహర్దశ వచ్చింది. ఎన్నడూ ఊహించనివిధంగా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఈ ప్రభుత్వ పాఠశాల రూపుదిద్దుకుంది. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వసతి సదుపాయాలు ఆధునిక హంగులతో కల్పించారు. గత రెండు, మూడు సంవత్సరాలుగా మంచి ఫలితాలు సాధిస్తూ విద్యార్థులు అన్నిరంగాలలో రాణిస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకునేవిధంగా ఈ స్కూల్ అభివృద్ధి చెందుతుంది.

ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలల నిబంధనల ప్రకారం 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలు ఇస్తూ తరగతులు నిర్వహించాలి. కానీ ప్రస్తుతం బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల భవనం, అందుకు సరిపడా పాఠశాల వైశాల్యం తగినన్ని తరగతి గదులు లేకపోవడంతో మూడవ తరగతి నుంచి చేర్చుకోవలసిన ప్రవేశాలు 5వ తరగతి నుంచి ప్రవేశాలు తీసుకుంటున్నారు. అయినా పాఠశాల తరగతి గదులు ఒక్కో క్లాస్‌కు ఒకే సెక్షన్‌తో 250 మంది విద్యార్థులకు మాత్రమే సరిపోతుంది.

కానీ తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న విద్యార్థులకు ప్రవేశాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తల్లితండ్రులు పాఠశాలలో కనీసం 500 మంది విద్యార్థులు చదువుకునే వీలుగా మరో పాఠశాల భవనాన్ని నిర్మించాలని, లేదా ప్రస్తుతం ఉన్న భవనంపైన లేదా మరొకచోట ఏర్పాటు చేస్తే తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందని తల్లితండ్రులు కోరుతున్నారు.

తాడ్‌బంద్‌లో మూతపడిన పాఠశాలను కేటాయిస్తే బాగుంటుంది



ఈ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పూర్తిగా నిండిపోయాయి. అయినప్పటికీ అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు ఈ ప్రభుత్వ స్కూళ్ల ఎదుట బారులు తీరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు వారి తల్లితండ్రులు 2024-25 నూతన విద్యాసంవత్సరం అడ్మిషన్‌లు పొందడానికి క్యూ కడుతున్నారు. కాగా తాడ్‌బంద్‌లో ఒక ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో తగినంత మంది విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో గత రెండు సంవత్సరాలుగా మూసివేశారు. నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనంను గతంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటుచేయాలని చూసినా అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనంను సంబంధిత అధికారులు పరిశీలించి, ఆశ్రమ పాఠశాలకు కేటాయించి అందులో శాశ్వత నిర్మాణం చేపడితే బాగుంటుంది.

- బానోతు లాలూ, బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్

బాధితుడి ఫిర్యాదుపై అలసత్వం

● నాగోల్ ఎస్‌హెచ్‌ఓపై చర్య

● సీపీ ఆఫీస్‌కు తాత్కాలిక అటాచ్‌మెంట్

కొత్తపేట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బాధితుడి ఫిర్యాదుపై అలసత్వం వహించిన నాగోల్ ఎస్‌హెచ్‌ఓ పరశురాంను ఈనెల 22న సీపీ ఆఫీస్‌కు తాత్కాలిక అటాచ్‌మెంట్ చేస్తూ సీపీ తరుణ్‌జోషీ ఉత్తర్వులు జారీచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.... ఈనెల 2న ఎల్‌బీనగర్, ఎన్‌టీఆర్‌నగర్‌లో సాయినగర్ కాలనీకి చెందిన వి.మల్లేష్, నరేష్, ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన అనిల్, సాయినగర్‌కు చెందిన జ్యోతి, నాగరాజు, నాగోల్‌కు చెందిన పీ.మనోజ్, సాయినగర్ కాలనీకి చెందిన శశాంక్, సాయినగర్ గుడిసెల్లో ఉండే పవన్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు బాలలు, భరత్‌నగర్‌కు చెందిన దాసరి గౌతం అలియాస్ బద్దు (20) మధ్య గొడవ జరిగింది. గాయపడ్డ గౌతం ఈనెల 21న నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌హెచ్‌ఓ పరశురాం కేసు నమోదు చేయడంలో అలసత్వం వహించడంతో బాధితుడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ తరుణ్ జోషి....పరశురాంను కమిషనరేట్‌కు ఆటాచ్ చేశారు. ఫిర్యాదుపై స్పందించడంలో అలసత్వం వహించిన ఎస్ఐ మధు, ఏఎస్ఐ అంజయ్యపై కూడా సీపీ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎల్‌బీనగర్ డీఐ సుధాకర్‌ను తాత్కాలికంగా నాగోల్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.

సాయినగర్‌లో ఏం జరిగిందంటే!

ఎల్‌బీనగర్‌లోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ఈనెల 2న నిందితులకు, భరత్‌నగర్‌కు చెందిన దాసరి గౌతం అలియాస్ బద్దు (20) మధ్య గొడవ జరిగింది. గతంలో జువెనైల్ అఫెండర్లకు, గౌతంకు గొడవలు జరిగాయి. గౌతంపై ద్వేషం పెంచుకున్న వారు ప్రధాన నిందితుడైన వీ.మల్లేష్‌తో కలిసి ఈనెల 2న ఎన్‌టీఆర్‌నగర్‌లో గొడవపడ్డారు. అప్పటినుంచి గౌతం కదలికలను గమనిస్తూ అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 6వ తేదీ తెల్లవారుజామున నాగోల్, సాయినగర్ కాలనీలోని ఓ స్నేహితుడి ఇంట్లో ఉన్న గౌతంను బయటకు లాక్కొచ్చి కులం పేరుతో దుర్భాషలాడుతూ టెలిఫోన్ స్తంభానికి కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు.

బాధితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.15వేల నగదు తీసుకుని పారిపోయారు. ఈనెల 21న గౌతం నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌హెచ్‌ఓ స్పందించలేదు. దీంతో పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 22న 8మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు జువెనైల్ అఫెండర్లను రెస్క్యూ హోంకు తరలించారు. నిందితులపై హత్యాయత్నం, కిడ్నాప్, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.



ఒలింపిక్ జ్యోతితో పరుగుతీస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి, జంపన ప్రతాప్

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

బోయిన్‌పల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ బోయిన్‌పల్లి ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సహకారంతో వివిధ పాఠశాలల విద్యార్థులు, కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు, క్రీడాభిమానులతో ఆదివారం సికింద్రాబాద్ జింఖానాగ్రౌండ్ నుంచి ఎల్‌బీ స్టేడియం వరకు ఒలింపిక్ డే రన్ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ మాస్టర్స్ క్రీడాకారుడు, ఎన్ఎంఎఎ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ బోయినపల్లి చీఫ్ ప్యాట్రన్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫాల్గుణ, హైదరాబాద్ జిల్లా డీఎస్‌డీవో సుధాకర్, జాతీయ మాస్టర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ప్రభుకుమార్ గౌడ్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఒలింపిక్ జ్యోతిని వెలిగించి, జెండాను ఊపి అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభించారు. సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ కేంద్రాల నుంచి క్రీడాకారులు, విద్యార్థులు ఒలింపిక్ స్ఫూర్తి రన్‌తో ఎల్‌బీ స్టేడియంకు చేరుకున్నారు. సెయింట్ మార్టిన్స్ స్కూల్ బాలానగర్‌కు చెందిన సుమారు 200 మంది విద్యార్థులతో పాటు సుమారు 300 మందికి పైగా ఈ రన్‌లో పాల్గొన్నారు. లెట్స్ రన్ నినాదంతో ప్రతిరోజు 30నిమిషాల వ్యాయామంతో ఆరోగ్యం, ఆహ్లాదం సొంతం చేసుకోవాలని ఈ సందర్భంగా క్రీడాకారులు విద్యార్థులకు మాజీ క్రీడాకారులు సూచించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ బోయిన్‌పల్లి సభ్యులు జగదీష్, స్టాన్లీ, సత్యనారాయణ, సాయిబాబా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

● ఎంపీ ఈటల రాజేందర్



బోయిన్‌పల్లి సీతారాంపురంలో ఏర్పాటుచేసిన సభలో ఎంపీ ఈటల రాజేందర్‌తో బానుక నర్మద మల్లికార్జున్

బోయిన్‌పల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా పరిష్కరిస్తూ రామన్నకుంట చెరువును అభివృద్ధి చేస్తానని, వారసత్వ రాజకీయాలను బీజేపీ ప్రోత్సహించదని, రాష్ట్రంలో ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలో బీజేపీ అధిష్ఠానానికి స్పష్టత ఉందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన నేపథ్యంలో కంటోన్మెంట్ సీతారాంపురంలో బానుక నర్మద మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన సభకు ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, స్థానిక ప్రజలు ఆయనను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ కుటుంబ పార్టీల మాదిరిగా వారసత్వ రాజకీయాలను బీజేపీ ప్రోత్సహించదని అన్నారు. బీజేపీలో కీలక నాయకులకు అన్నివర్గాలవారికి సముచిత స్థానం లభిస్తుందని ఆయన అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసేవిధంగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన ప్రజలు, స్థానిక కాలనీవాసులు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మినీ భారత్‌గా మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం

మారేడుపల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ బలంగా ఉందని మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మహేంద్రహిల్స్‌లో తన చిన్ననాటి మిత్రుడు వి.నరసింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం మినీ భారత్‌గా అనిపిస్తుందని అభివర్ణించారు. ఇక్కడి ప్రజలు, ప్రేమ ఆదరణను చూపుతారని పేర్కొన్నారు. అంతకు ముందు వి.నర్సింగరావు, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు డాక్టర్ వంశతిలక్, పిట్లనాగేష్, పట్టాభి, బి.వి.రెడ్డి, కోటేశ్వరరావులతో పాటు స్థానికులు ఎంపీ ఈటల రాజేందర్‌కు శాలువాలు కప్పి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

పికెట్‌లో.. కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డ్ పరిధిలో పికెట్‌లో ఆదివారం కంటోన్మెంట్ బీజేపీ కన్వీనర్ విజయానంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్ విచ్చేశారు. ఈ సందర్భంగా విజయానంద్ ఎంపీ ఈటల రాజేందర్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో టోపీ శంకర్, రాజ్ మల్లేష్, ప్రేమ్, ఎన్.నాగభూషణంరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3, 4 నోటిఫికేషన్‌లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రకటించాలి

నల్లకుంట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా గ్రూప్-3, 4 నోటిఫికేషన్‌లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు. జనవరి నెలలో తమిళనాడులో 2వేల టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను అక్కడి ప్రభుత్వం ప్రకటించి నిరుద్యోగులను ఆదుకుందని వారు గుర్తుచేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి వివేక్‌లు మాట్లాడారు. గ్రూప్-3, 4 నోటిఫికేషన్లలో ప్రభుత్వం టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

షూటింగ్ పోటీల విజేతలకు పతకాలు



పతకాలు సాధించిన విజేతలు

రాయదుర్గం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీలు ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈవెంట్‌లో సుమారు 300లకు పైగా షూటర్స్ పాల్గొని అసాధారణ ప్రతిభను క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించారు. టీఆర్ఏ అధ్యక్షుడు అమిత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించాయి. గచ్చిబౌలిలోని సాట్స్ షూటింగ్ రేంజ్‌లో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవాల్లో పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలను సత్కరించారు. 10ఎంఎం రైఫిల్, 10ఎం ఓపెన్ సైట్ రైఫిల్, ట్రాప్ ఈవెంట్ ఈ పోటీల్లో ఉన్నాయి. ఎస్25/ క్లేపావురం చాంపియన్‌షిప్ మాస్టర్‌కు వాసిఫ్ హసన్‌లతీఫ్ 42/50 వ్యక్తిగత స్కోర్‌తో గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. ఫైజల్ యూసుఫుద్దీన్ 37/50 స్కోరుతో రజిత పతకం సాధించగా, మహ్మద్ పతేఫైజ్ బిన్ జంగ్ 36/50 స్కోర్‌తో కాంస్య పతకం సాధించాడు. ఎస్24/10ఎం(ఎన్ఆర్) రైఫిల్ చాంపియన్‌షిప్ జూనియర్ మహిళ వ్యక్తిగత విభాగంలో లాఖిఅబిషేక్ మహేశ్వరి 396/400 స్కోర్‌తో గోల్డ్‌మెడల్ పొందారు. వెరబెలి మహతికి స్విలర్ మెడల్ సాధించింది. పురుషుల వ్యక్తిగత విభాగంలో ఎస్19 (10ఎఎం రైఫిల్) పురుషుల విభాగంలో దనుష్ 398/400 స్కోర్‌తో గోల్డ్‌మెడల్ అందుకున్నారు. విక్రాంత్‌రాజ్ దుర్గల 395/400 స్కోర్‌తో రజత పతకం పొందాడు. రోహన్ సిరిగడి 391/400 స్కోర్‌తో క్యాంస పతకం సాధించాడు. ఈ అవార్డుల కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మాజీ డీజీపీ, ప్రస్తుత రోడ్‌సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ అంజనీకుమార్ పాల్గొని విజేతలకు పతకాలు అందజేశారు.



అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్‌లో వివిధ దేశాల ప్రతినిధులు

ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్

అల్వాల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హుస్సేన్‌సాగర్ లేక్ వద్ద అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్‌ను నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక సెమినార్‌ను మూడు రోజులుగా నిర్వహిస్తుండగా ఆదివారంతో ముగిసింది. ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే నేతృత్వంలో సెమినార్‌ను నిర్వహించారు. త్వరలో హుస్సేన్‌సాగర్‌లో అంతర్జాతీయ సెయిలింగ్ వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సెయిలింగ్ పోటీలలో పాటించాల్సిన నియమ నిబంధనలతో పాటు తీసుకోవాల్సిన పద్ధతులపై పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించేవారికి సెమినార్‌లో లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే వివరించారు. 15 ఏళ్ల తరువాత ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్‌ను భారతదేశంలో నిర్వహించడం గర్వంగా ఉందని నీరజ్‌వర్షనే అన్నారు. ఈ సెమినార్ భారతీయ సెయిలింగ్ కమ్యూనిటీకి ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. ఈ సెమినార్‌లో క్రిస్ వాట్స్ (జీబీఆర్), రూట్ సబ్‌నిరన్ (థాయిలాండ్), లియోనార్డ్ చిన్ (మలేషియా), పోక్‌పాంగ్ (థాయిలాండ్) వంటి ప్రముఖ అంతర్జాతీయ జడ్జీలు పాల్గొన్నారు.



డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

మౌలిక వసతులకు పెద్ద పీట : ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బస్తీ పర్యటనలో భాగంగా ఆదివారం వార్డ్-7 పరిధిలోని న్యూ గాంధీనగర్ ఓల్డ్ గాంధీనగర్‌లో పర్యటించారు. స్థానిక మహిళల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికుల మధ్య కూర్చుని స్వయంగా ఎమ్మెల్యే బుక్‌లో నోట్ చేసుకోవడం జరిగింది. స్థానిక ప్రజలు ఓపెన్ నాలా డ్రైనేజీ సమస్య ఉందని ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన శానిటైజేషన్ విభాగం అధికారి మహేందర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. ప్రజలు ఇబ్బందిపడుతున్నారు ముందుగా ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్నా, రేమండ్, ప్రదీప్, అబ్రహం జాన్, రమేష్, రాజన్, రంజిత్, టోని, మిథున్, వసంత, సునీత పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యం



వెంకటయ్య

బోయిన్‌పల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంటినుంచి బయటకు వెళ్ళిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లి భవానీనగర్‌లో నివాసం ఉండే కర్రె వెంకటయ్య(55) రోజువారీ కూలీపనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి కుమార్తె లావణ్య ఉంది. ఆమె భర్త అనారోగ్యంతో మృతిచెందడంతో ఓల్డ్ బోయిన్‌పల్లిలోని భవానినగర్‌లో తండ్రితో కలిసి ఉంటుంది. అయితే ఈనెల 18న కూతురు ఇంట్లోలేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్ళిన వెంకటయ్య ఇంటికి తిరిగి రాలేదు. మూడురోజులుగా ఇంటికి తిరిగివస్తాడులే అనుకున్న కూతురు ఆదివారం వరకు వేచిచూసింది. బంధువులను, తెలిసినవారిని ఆరా తీసినా ఫలితంలేకపోవడంతో బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుడికి వెళ్లొస్తానని చెప్పి...



దశరథ్

మరో సంఘటనలో గుడికి వెళ్ళివస్తానని చెప్పివెళ్ళిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి చిన్నతోకట్టలో నివాసం ఉండే పేదింటోళ్ల దశరథ్ (55) ఈనెల 1న తాను గుడికి వెళ్తున్నానని భార్య ఎల్లమ్మకు చెప్పి ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. వారంరోజులు గడిచినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్న కుమారుడు సతీష్‌కు విషయం తెలిపింది. తెలిసినవారితో ఏదైనా పుణ్యక్షేత్రానికి వెళ్ళి తిరిగివస్తాడు అనుకున్న కుమారుడు తల్లికి సర్దిచెప్పాడు. కానీ 20 రోజులు గడిచినా దశరథ్ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అనుమానం వచ్చిన భార్య, కుమారుడు రెండురోజులుగా అతని ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆదివారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో దారిదోపిడీ

● ఇద్దరు సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

అడ్డగుట్ట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మధ్యరాత్రి సమయంలో దారెంట వెళ్లే వాహనదారుల నుంచి సెల్‌ఫోన్ చోరీ చేస్తున్న ఇద్దరు దొంగల్ని గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా ముస్తఫా నగర్‌కు చెందిన మసూద్ ఉర్ రెహ్మాన్ (31) భోలక్‌పూర్‌కు చెందిన ఫజల్ ఉర్ రెహ్మాన్ (22) ఇద్దరూ స్నేహితులు. మాసూద్ ఉర్ రెహ్మాన్ 10వ తరగతి వరకు చదివి మానేశాడు. దుబారా ఖర్చులు చేస్తున్న రెహ్మాన్ సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీ బాటపడ్డాడు. గతంలో నాచారం పోలీస్ స్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడు. ఈనెల 20న రాత్రి సమయంలో తన స్నేహితుడైన ఫజల్ ఉర్ రెహ్మాన్‌ను తన దగ్గరికి పిలిపించాడు. ఇద్దరూ కలిసి బైకుపై తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బైకుపై వెళుతుండగా చాదర్‌ఘాట్ సమీపంలో స్వాగత్ బార్ వద్ద ఒక బైకు పార్కు చేసి ఉండగా వెనుక కూర్చున్న వ్యక్తి బైకును దొంగలించి ఇద్దరూ కలిసి రెండు బైకుల్లో సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్దకు చేరుకున్నారు. సికింద్రాబాద్ గణేష్ గుడి వద్ద ఓ వ్యక్తిని బెదిరించి పారిపోతున్న క్రమంలో విధులు నిర్వహిస్తున్న గోపాలపురం కానిస్టేబుళ్లు గమనించి ఇద్దరినీ వెంబడిస్తుండగా ఇద్దరూ ఒకే బైకుపై సికింద్రాబాద్ సిటీ లైట్ హోటల్ వైపు వెళుతున్నారు. ఇద్దరి వద్ద గన్ ఉందన్న విషయం కానిస్టేబుల్‌కు తెలియకపోవడంతో వెనుక వీళ్లను వెంబడిస్తున్న కానిస్టేబుల్‌ను గన్‌తో బెదిరించారు. అయినప్పటికీ సికింద్రాబాద్‌లో ఇద్దరినీ కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.



జయగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అర్చకులు, బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘు కిరణాచార్యుల ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీచేశారు

- మౌలాలి, ఆంధ్రజ్యోతి